# త్రివిధ దళాల్లో.. ఉజ్వల కెరీర్ ఎన్‌డీఏ



**త్రివిధ దళాల్లో అధికారి కావాలని కలలు కనేవారికి నేషనల్ డిఫెన్స్ అకాడెమీ (ఎన్‌డీఏ) ఉత్తమమైన మార్గం. కేవలం ఇంటర్మీడియెట్ అర్హతతోనే సైన్యంలో ఆకర్షణీయమైన కెరీర్‌ను సొంతం చేసుకోవచ్చు. ఎన్‌డీఏలో చేరితే ఉజ్వల భవిష్యత్‌తోపాటు దేశ భద్రతలో పాలు పంచుకుంటున్నామనే సంతృప్తి కూడా మిగులుతుంది. ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌లో పని చేసేందుకు తురుపు ముక్కలను తయారు చేసేందుకు యూపీఎస్సీ ఏటా ఏప్రిల్, ఆగస్టులో ఎన్‌డీఏ పరీక్షను నిర్వహిస్తోంది. సవాళ్లకు సిద్ధంగా ఉంటూ దూసుకుపోయే తత్వం ఉన్న యువతను పుణెలోని నేషనల్ డిఫెన్స్ అకాడెమీ సాదరంగా ఆహ్వానం పలుకుతోంది..**

ఇంటర్ పూర్తి కాగానే... చాలామంది ఎంసెట్... ఐఐటీ... ఏఐట్రిపుల్ఈ... గురించే ఆలోచిస్తారు. అలా కాకుండా కాస్త విభిన్నతను కోరుకునేవాళ్లకు ఆ అర్హతతో ఏకంగా ఉన్నతోద్యోగాలే ఉన్నాయనడం ఏమాత్రం అతిశయోక్తి కానే కాదు. తక్కువ వయస్సులో ఆఫీసర్ స్థాయి ప్రభుత్వ ఉద్యోగం పొందే అవకాశం ఇంటర్మీడియట్ అర్హతతోనే సొంతం చేసుకోవచ్చు. ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ వీటిలో దేనిలోనైనా చేరొచ్చు. అంతే కాదు మూడేళ్ల శిక్షణ పూర్తి చేసుకున్న తర్వాత బ్యాచిలర్ డిగ్రీ పట్టా కూడా పుచ్చుకోవచ్చు. శిక్షణా సమయంలో నెలకు రూ.21,000 స్టైపెండ్‌గా పొందొచ్చు. ఉద్యోగంలోకి చేరిన వెంటనే రూ.45,000 దాకా ఆరంభ వేతనంతో ఆకాశమే హద్దుగా నింగి (ఎయిర్‌ఫోర్స్), నీరు (నేవీ), నేల (ఆర్మీ)ల్లో ఎదగొచ్చు.

**ఎన్‌డీఏ:** దేశ భద్రతను కాపాడే ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌కు చురుకైన సైనికులను అందించే లక్ష్యంతో మహారాష్ట్రలోని పుణెలో భారత ప్రభుత్వం ఆరు దశాబ్దాల క్రితం నేషనల్ డిఫెన్స్ అకాడెమీ(ఎన్‌డీఏ)ను ఏర్పాటు చేసింది. అప్పటినుంచి ఎంతోమంది సుశిక్షితులైన సైనికులను త్రివిధ దళాలకు అందిస్తూ వస్తోంది. రక్షణ దళాల్లో చేరేందుకు మేటి పరీక్షగా ఎన్‌డీఏ అండ్ ఎన్ఏకు మంచి పేరుంది. ఈ పరీక్షను యూపీఎస్సీ ఏటా రెండుసార్లు నిర్వహిస్తోంది. భారతదేశంలో ఇంటర్మీడియట్ అర్హతతో నిర్వహించే చదువు, శిక్షణ, ఉద్యోగం మూడింటి సమ్మిళిత ఏకైక పరీక్ష ఇదే. ఇంటర్మీడియట్ చదివిన విద్యార్థుల పాలిట ఉన్న అద్భుత అవకాశాల్లో ఎన్‌డీఏ అండ్ ఎన్ఏకు దీటైంది వేరొకటి లేదు.

## ఎంపిక విధానం: మూడంచెల్లో...

**స్టేజ్ 1:** రాత పరీక్ష (మ్యాథ్స్, జనరల్ ఎబిలిటీ) 900 మార్కులు

**స్టేజ్ 2:** ఇంటర్వ్యూ(ఇంటెలిజెన్స్ అండ్ పర్సనాలిటీ టెస్ట్) 900 మార్కులు

**స్టేజ్ 3:** మెడికల్ ఎగ్జామినేషన్

**రాత పరీక్ష :** ఆబ్జెక్టివ్ పద్ధతిలో ఇంగ్లిష్ మాధ్యమంలో ఉంటుంది. తప్పు సమాధానానికి మార్కుల్లో కోత. రాత పరీక్షలో ఉత్తీర్ణులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. అందులో విజేతలుగా నిలిచినవాళ్లు వైద్య పరీక్షలకు వెళ్తారు. ఆ పరీక్షలో ఫిట్‌నెస్ ఓకే అయిన అభ్యర్థులు కోర్సుకు ఎంపికవుతారు. వాస్తవానికి రాత పరీక్ష తర్వాతే ఎంపిక ప్రక్రియలో అత్యంత క్లిష్టమైన దశ మొదలవుతుంది. అదే సర్వీసెస్ సెలక్షన్ బోర్డ్ ఇంటర్వ్యూ..

ఐదు రోజుల పాటు జరిగే ఈ ప్రక్రియలో అభ్యర్థికున్న మానసిక ధ్రుఢత్వాన్ని పరిశీలించే విధంగా మొత్తం 900 మార్కులకు పలు పరీక్షలు జరుగుతాయి. ఈ పరీక్షలన్నింటిలో రాణించిన విద్యార్థులకు చివరగా మెడికల్ టెస్ట్ నిర్వహించి నేషనల్ డిఫెన్స్ అకాడెమీలో ప్రవేశం ఖరారు చేస్తారు.

## పోటీ తీవ్రం:

ఎన్డీయే పరీక్ష దేశ వ్యాప్తంగా జరుగుతుంది. దాంతో దీనికి పోటీ కూడా తీవ్రమే. ప్రధానంగా ఉత్తరాది రాష్ట్రాల్లో ఈ పరీక్ష పట్ల క్రేజ్ ఎక్కువ. ఇక్కడ పదో తరగతి నుంచే ఎన్డీఏపై దృష్టి సారించి చదువుతుంటారు. కాబట్టి వందల సంఖ్యలో ఉండే సీట్లకు వేలమంది అభ్యర్థులతో పోటీపడి విజయం సాధించాలంటే.. గట్టి కృషి అవసరం. రాత పరీక్షలో రాణిస్తేనే.. ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూలో అడుగుపెట్టే అవకాశం ఉంటుంది.

## శిక్షణ ఇలా...

ఎంపికైన అభ్యర్థులకు పుణెలోని నేషనల్ డిఫెన్స్ అకాడెమీలో మూడేళ్ల డిగ్రీ చదువుతో పాటు శిక్షణ నిర్వహిస్తారు. ఎయిర్ ఫోర్స్, నేవీ, నావల్ అకాడెమీ కోర్సులకు ఎంపికైనవాళ్లు బీఎస్సీ (మ్యాథ్స్, ఫిజిక్స్, కంప్యూటర్ సైన్స్/కెమిస్ట్రీ) కోర్సుగా ఎంచుకోవచ్చు. ఆర్మీ గ్రూప్ కోర్సుకు ఎంపికైనవాళ్లు బీఏలో హిస్టరీ/జాగ్రఫీ/ఎకనామిక్స్/పొలిటికల్ సైన్స్‌ల్లో నచ్చిన మూడు ఆప్షన్లను ఎంచుకోవచ్చు. వర్క్‌షాప్, ఏరియా స్టడీ, మిలిటరీ హిస్టరీలను సిలబస్‌తోపాటు బోధిస్తారు. రక్షణ దళాల అవసరాలకు అనుగుణంగా శారీరక తర్ఫీదు ఉంటుంది. అన్ని విభాగాల వారికీ శిక్షణ ఒకే పద్ధతిలో ఉంటుంది. మూడేళ్ల కోర్సు పూర్తి చేసిన తర్వాత ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ) బీఏ/బీఎస్సీ డిగ్రీలను ప్రదానం చేస్తుంది.

ఆ తర్వాత ఆర్మీ క్యాడెట్లు డెహ్రాడూన్‌లోని ఇండియన్ మిలిటరీ అకాడెమీ (ఐఎంఏ)లో ఏడాదిపాటు ఆఫీసర్ శిక్షణ పొందుతారు. నేవల్ క్యాడెట్లు కూడా ఏడాదిపాటు కేరళలో సముద్రంలో శిక్షణ పొందుతారు. ఎయిర్‌ఫోర్స్ క్యాడెట్లకు ఫ్లైయింగ్‌లో ఏడాదిన్నరపాటు ఎయిర్‌ఫోర్స్ అకాడెమీ–హైదరాబాద్‌లో శిక్షణ నిర్వహిస్తారు.

ఈ మూడు క్యాడెట్లకూ సంబంధిత శిక్షణలో నెలకు రూ.21,000 స్టైపెండ్‌గా చెల్లిస్తారు.

## కెరీర్ గ్రాఫ్...

క్యాడెట్ శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ మూడు దళాల్లోనూ వరుసగా... లెఫ్టినెంట్, సబ్ లెఫ్టినెంట్, ఫ్లైయింగ్ ఆఫీసర్ క్యాడర్‌తో ఆఫీసర్ స్థాయి కెరీర్ ప్రారంభమవుతుంది. పై

మూడు విభాగాల్లోనూ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్, అడ్మిరల్, ఎయిర్ చీఫ్ మార్షల్ విశిష్ట ఉద్యోగాలు. ఎన్‌డీఏ ద్వారా ఎంపికైనవాళ్లు అవకాశాన్ని బట్టి రక్షణ దళాల్లో సంబంధిత విభాగానికి భవిష్యత్తులో చీఫ్‌గా ఎంపిక కావచ్చు. ప్రారంభ కెరీర్‌కు, అత్యంత విశిష్ట ఉద్యోగానికి మధ్యలో 8 స్థాయిలుంటాయి. ఆర్మీ/నేవీ/ఎయిర్‌ఫోర్స్ ఏ విభాగంలో కెరీర్ ఎంచుకున్నా వేతనాల్లో వ్యత్యాసాలుండవు. పూర్తికాలం సర్వీస్‌లో ఉన్న ప్రతి ఒక్కరూ తప్పకుండా సంబంధిత విభాగంలో మేజర్ జనరల్/రేర్ అడ్మిరల్/ఎయిర్ వైస్ మార్షల్ స్థాయికి చేరుకుంటారు. విధి నిర్వహణలో మరణిస్తే రూ.50 లక్షలకు పైగా చెల్లిస్తారు.

| **సబ్జెక్టు** | **కాలవ్యవధి** | **మార్కులు** |
|---|---|---|
| మ్యాథమెటిక్స్ | 2 1/2గంటలు | 300 |
| జనరల్ ఎబిలిటీ టెస్ట్ | 2 1/2 గంటలు | 600 |

## 60 వసంతాల ఎన్‌డీఏ..

ప్రపంచంలోనే ప్రథమంగా త్రివిధ దళాలకు ఒకే చోట శిక్షణ, చదువు రెంటినీ మిళితం చేసి కోర్సు రూపొందించిన ఘనత ఎన్‌డీఏకు దక్కుతుంది. రెండో ప్రపంచయుద్ధం అనుభవంతో కదన రంగంలో త్రివిధ దళాల మధ్య సమన్వయమెంతో కీలకం అని ఆనాడే గుర్తించారు. ఈ మూడు రంగాలకు సంబంధించి ఒకే కేంద్రంలో శిక్షణ ఇవ్వాలని స్వాతంత్ర్యానికి ముందే భారత ప్రభుత్వం 1945లో హైపర్ కమిటీ ఏర్పాటు చేసింది. పుణెలోని ఖడక్‌వాస్లాలో సుమారు 8000 ఎకరాల సువిశాల ప్రకృతి రమణీయ ప్రాంతంలో నేషనల్ డిఫెన్స్ అకాడెమీ (ఎన్‌డీఏ) ఏర్పాటు చేశారు. 2009 జనవరి నాటికి ఈ అకాడెమీ 60 వసంతాలు పూర్తి చేసుకుంది. త్రివిధ దళాల సేవల కోసం ఇప్పటిదాకా 27,000 మంది ఇక్కడ శిక్షణ పొందారు.

## ఎవరు అర్హులు..

**విద్యార్హత:** ఇంటర్మీడియట్

**ఆర్మీ వింగ్:** ఏదైనా ఇంటర్మీడియట్ గ్రూప్‌తో పాస్

**ఎయిర్ ఫోర్స్, నేవీ, నావల్ అకాడెమీ:**

మ్యాథ్స్, ఫిజిక్స్‌తో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత..

**వయోపరిమితి:**

జనవరి 2, 1992 నుంచి జూలై 1, 1994 మధ్య జన్మించి ఉండాలి.

- అవివాహిత పురుష అభ్యర్థులు మాత్రమే అర్హులు
- నిర్దేశిత శారీరక ప్రమాణాలుండాలి.

**నోటిఫికేషన్:**

ఏటా రెండుసార్లు (మార్చి, అక్టోబర్ నెలల్లో)

**పరీక్ష:**

ఏప్రిల్, ఆగస్ట్ నెలల్లో

**మన రాష్ట్రంలో పరీక్ష కేంద్రాలు:**

హైదరాబాద్, విశాఖపట్నం, తిరుపతి

**ప్రకటన:**

ఎంప్లాయ్‌మెంట్ న్యూస్/జాతీయ ఆంగ్ల దినపత్రికల్లో చూడొచ్చు.

# ప్రిపరేషన్... సిలబస్

### మ్యాథమెటిక్స్...

300 మార్కులకు రెండున్నరగంటల పాటు జరిగే మ్యాథమెటిక్స్ (పేపర్-1)లో.. అల్జీబ్రా, మాట్రిక్స్ అండ్ డిటర్మినెంట్స్, ట్రిగ్నామెట్రీ, అనలిటికల్ జామెట్రీ ఆఫ్ టూ అండ్ త్రీ డైమన్షన్స్, డిఫరెన్షియల్ క్యాలిక్యులస్, ఇంటిగ్రల్ క్యాలిక్యులస్ అండ్ డిఫరెన్షియల్ ఈక్వేషన్స్, వెక్టార్ అల్జీబ్రా, స్టాటిస్టిక్స్ అండ్ ప్రాబబిలిటీ అంశాల్ని సిలబస్‌లో చేర్చారు. ఈ పేపర్‌లో మంచి మార్కులు సాధించాలంటే.. సిలబస్‌లోని అన్ని అంశాల పైనా పట్టు సాధించాలి. పరీక్షలో సిలబస్‌లోని అన్ని అంశాల నుంచి ప్రశ్నలు వస్తున్నాయి. అయితే, మ్యాథ్స్ పేపర్లోని ప్రశ్నలన్నీ కాన్సెప్ట్ బేస్డ్‌గానే ఉంటున్నాయి. కాబట్టి అభ్యర్థులు సిలబస్‌లోని అన్ని అంశాలకు సంబంధించి మౌలిక అంశాలపై స్పష్టమైన అవగాహన పెంచుకోవాలి. ఫార్ములాస్‌పై పట్టు సాధిస్తే... పరీక్షలో సమయం వృధా కాకుండా ఎక్కువ ప్రశ్నలను రాసేందుకు వీలవుతుంది.

**జనరల్ ఎబిలిటీ:** 600 మార్కులకు రెండున్నర గంటల వ్యవధిలో ఈ పరీక్ష ఉంటుంది. ఇందులో పార్ట్-ఏ,పార్ట్-బీలు ఉంటాయి.

**ఇంగ్లిష్ :** పార్ట్-ఏలో ఇంగ్లిష్ 200 మార్కులకు ఉంటుంది. ఇందులో అభ్యర్థికి ఇంగ్లిష్ భాషపై కనీస పరిజ్ఞానం ఉందో లేదో పరీక్షించేందుకు వీలుగానే ప్రశ్నలు అడుగుతారు. యూసేజ్, ఒకాబులరీ, రీడింగ్ కాంప్రహెన్షన్, కొహెషన్ నుంచే ప్రశ్నలు వస్తాయి. షార్ట్‌స్టోరీస్ చదవడం, పార్ట్స్ ఆఫ్ స్పీచ్, టెన్సెస్ నేర్చుకోవడం... కరక్షన్ ఆఫ్ సెంటెన్సెస్, యాంటానిమ్స్, సినానిమ్స్‌కు సంబంధించిన ప్రశ్నలకు సులువుగానే సమాధానం రాయొచ్చు. తద్వారా ఈ పేపర్‌లో ఉత్తమంగా రాణించడానికి దోహదపడుతుంది.

**జనరల్ నాలెడ్జ్:** జనరల్ ఎబిలిటీ పేపర్‌లోని పార్ట్-బి మొత్తం అభ్యర్థిలోని జనరల్ నాలెడ్జ్‌ని పరీక్షించేందుకు ఉద్దేశించింది. దీనికి 400 మార్కులు కేటాయించారు. ఇందులో ఫిజిక్స్, కెమిస్ట్రీ, జనరల్ సైన్స్, చరిత్ర, జాగ్రఫీ, కరెంట్ అఫైర్స్ నుంచి ప్రశ్నలు వస్తాయి. ఇంటర్మీడియట్ ఎంపీసీ విద్యార్థులు ఈ పరీక్షను సులభంగానే ఎదుర్కోవచ్చు.

ఆర్ట్స్ గ్రూప్ విద్యార్థులు మాత్రం మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ అంశాల కోసం కసరత్తు చేస్తేనే సఫలీకృతం కాగలరు. కరెంట్ అఫైర్స్ కోసం సరిగ్గా పరీక్ష తేదీ నుంచి ఒక సంవత్సరం వెనుక వరకు ప్రపంచం, దేశంలో జరిగిన వివిధ పరిణామాలు తెలుసుకోవాలి.

### పరీక్షకు కొన్ని సూచనలు :

- ఒక ఏడాది ముందుగానే ప్రిపరేషన్ ప్రారంభించండి.
- ప్రిపరేషన్‌లో అన్ని సబ్జెక్టులకూ సమ ప్రాధాన్యం ఇవ్వడి.
- వేగం, కచ్చితత్వం పెంచుకునేందుకు సాధన, టెక్నిక్స్ అవసరం.

### ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూ కోసం..

- ఇంటర్వ్యూ సమయంలో ఆత్మవిశ్వాసాన్ని ప్రదర్శించండి.
- పొరపాటున కూడా అబద్ధాలు చెప్పకండి.
- సమాధానాల్లో వర్జినాలిటీ, నిజాయితీ ఉండేట్లు చూసుకోండి.

## త్రివిధ దళాల్లో జీత భత్యాలు ఇలా..

పే కమిషన్ ఏర్పాటుతో ఒక్కసారిగా రక్షణ దళాల్లో జీతాలు అమాంతం పెరిగాయి. మూడేళ్ల కోర్సు అనంతరం బేసిక్ ట్రైనింగ్‌లో నెలకు రూ.21,000 చెల్లిస్తున్నారు. రెండేళ్ల కిందట ఇది రూ.8000గా ఉండేది. శిక్షణ పూర్తి చేసుకున్న తర్వాత జీతం రూపంలో నెలకు రూ.35,000 సంపాదించొచ్చు. వీటికి అలవెన్సులూ కలుపుకుంటే రూ.45,000 ఆరంభ జీతంతో కెరీర్ మొదలవుతుంది. క్యాంటీన్, వసతి, ఆహార సామగ్రి, ఉచిత భోజనం, ఉచిత రైలు, విమాన ప్రయాణాలు, పిల్లలకు ఉచిత చదువులు, ఇన్సూరెన్స్ కవరేజ్...ఇవన్నీ రక్షణ దళాల్లో ఉద్యోగం చేసినవారికి సొంతమవుతాయి.

| ఆర్మీ | నేవీ | ఎయిర్ ఫోర్స్ | బేసిక్ పే (రూ.) | గ్రేడ్ పే(రూ.) |
|---|---|---|---|---|
| లెఫ్టినెంట్ | సబ్‌లెఫ్టినెంట్ | ఫ్లైయింగ్ ఆఫీసర్ | 15600-39100(పీబీ-3) | 5400 |
| కెప్టెన్ | లెఫ్టినెంట్ | ఫ్లైయింగ్ లెఫ్టినెంట్ | 15600-39100(పీబీ-3) | 6100 |
| మేజర్ | లెఫ్టినెంట్ కమాండర్ | స్క్వాడ్రన్ లీడర్ | 15600-39100(పీబీ-3) | 6600 |
| లెఫ్టినెంట్ కల్నల్ | కమాండర్ | వింగ్ కమాండర్ | 37400-67000(పీబీ-4) | 8000 |
| కల్నల్ | కెప్టెన్ | గ్రూప్ కెప్టెన్ | 37400-67000(పీబీ-4) | 8700 |
| బ్రిగేడ్ | కమడోర్ | ఎయిర్ కమాండర్ | 37400-67000(పీబీ-4) | 8900 |
| మేజర్ జనరల్ | రేర్ అడ్మిరల్ | ఎయిర్ వైస్ మార్షల్ | 37400-67000(పీబీ-4) | 10000 |
| లెఫ్టినెంట్ జనరల్ | వైస్ అడ్మిరల్ | ఎయిర్ మార్షల్ | 37400-67000(పీబీ-4) | 12000 |
| వైస్ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ | వైస్ అడ్మిరల్ (వీసీఎన్ఎస్) | ఎయిర్ మార్షల్ (వీసీఏఎస్) | 80000 (ఫిక్స్‌డ్) | |
| చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ | అడ్మిరల్ | ఎయిర్ చీఫ్ మార్షల్ | 90000 (ఫిక్స్‌డ్) | |